కంకర పరిచారు.. బీటీ మరిచారు



కంకరకే పరిమితమైన చౌదూర్ - మెట్టుగడ్డతండా రోడ్డు

- అసంపూర్తిగా రోడ్ల నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నవాబుపేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు చేపట్టిన బీటీరోడ్ల నిర్మాణాలు పూర్తి కావడం లేదు. సంవత్సరాల తరబడి అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని చౌదూర్ నుంచి కాకర్జాలతండా, రెడ్యానాయక్‌తండా, కోళ్లగుంటతండా మీదుగా మెట్టుగడ్డతండా వరకు 3 కి.మీ. మేర బీటీరోడ్డు నిర్మాణ పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. దీంతో తమ తండాకు బీటీ రోడ్డు నిర్మిస్తున్నారని తండావాసులు సంబురపడ్డారు. తీరా రోడ్డుపై కంకర పరిచి వదిలేయడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కంకర రోడ్డుపై రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు.



కొత్తపల్లి - కల్మన్‌కల్వ రోడ్డు ఇలా..

■ కొత్తపల్లి - కల్మన్‌కల్వ రోడ్డు సైతం కంకరకే పరిమితమైంది. సుమారు 4 కి.మీ. మేర బీటీరోడ్డు నిర్మించేందుకు గాను గతేడాది కంకర పరిచారు. అర్ధాంతరంగా పనులను వదిలేయడంతో కంకర రోడ్డుపై రాకపోకలు సాగించలేక పోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అసంపూర్తిగా ఉన్న బీటీరోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తిచేయాలి..



చౌదూర్ నుంచి చాలా గిరిజన తండాలు, మారుమూల పల్లెలకు రోడ్లు అవసరం. అసంపూర్తిగా ఉన్న బీటీరోడ్ల పనులను పూర్తిచేయాలని అధికారులను కోరాం. ప్రస్తుతం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గ్రామీణ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో చౌదూర్ రోడ్డు పూర్తి చేయాలని కోరుతున్నాం.
– వెంకటేష్, మాజీ సర్పంచ్, చౌదూర్

సమస్య పరిష్కరించాలి..



కంకర రోడ్డుపై కనీసం నడవలేని పరిస్థితి ఉంది. అర్ధాంతరంగా నిలిచిన పనులను పూర్తిచేయాలి. జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్లకు రూ. కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే.. గిరిజన తండాల రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక చొరవ చూపాలి. – సంతోష్ నాయక్, కాకర్జాలతండా

స్టేడియంలో సమస్యలు పరిష్కరిస్తాం

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్
- మార్నింగ్ వాకర్స్‌తో కలిసి నడక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా స్టేడియంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం ఉదయం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్, క్రీడాకారులతో కలిసి నడక చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే హైమాస్ట్ లైట్లు వేయిస్తామన్నారు. క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇక్కడ మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జాజిమొగ్గ నర్సింహులు, మునీరొద్దీన్, రాంలక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు పాపారాయుడు, వెంకటేశ్, క్రీడాకారులు కురుమూర్తిగౌడ్, బాలరాజ్, సునీల్, బొంబాయి నర్సింహ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముడా కార్యాలయంలో కొత్త చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.లక్ష్మణ్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

ఫీడర్ ఛానల్‌ను ఆధునికీకరించండి

అడ్డాకుల: మూసాపేట మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన సంకలమద్ది శివారులో ఉన్న ఫీడర్ ఛానల్‌ను బుధవారం నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. వేముల స్టేజీ వద్ద అండర్‌బ్రిడ్జి పనులు చేపట్టిన క్రమంలో నిర్మిస్తున్న సర్వీస్‌రోడ్డులో కాల్వ పూడ్చివేతకు గురైంది. ఈ విషయాన్ని కొమిరెడ్డిపల్లికి చెందిన మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యూటీ ఈఈ మనోహర్, ఏఈ తులసీరాంలు పూడ్చివేసిన కాల్వను పరిశీలించారు. రోడ్డు పనులు చేపట్టిన నిర్వాహకులు రాజు, బాల్‌రెడ్డితో అధికారులు మాట్లాడారు. రామస్వామి గుట్ట నుంచి కొమిరెడ్డిపల్లి చాకలికుంట వరకు ఉన్న ఫీడర్ ఛానల్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. వారి వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిరంజన్, గడ్డం రమేష్ తదితరులు ఉన్నారు.



ఫీడర్ ఛానల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మార్కెట్ యార్డు భద్రతకు ప్రాధాన్యత



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలను చైర్మన్, వైస్‌చైర్మన్, కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కొన్నేళ్లుగా మార్కెట్‌కు ధాన్యం అధికంగా వస్తుందని.. మార్కెట్‌లోని షెడ్లకు చిన్నచిన్న మరమ్మతు చేయాల్సి ఉందన్నారు. హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. మార్కెట్‌లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు రూపొందించి పంపాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత మార్కెట్ పాలక మండలిపై ఉందన్నారు. రైతులు బాగుంటేనే అందరం బాగుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, కార్యదర్శి విజయలక్ష్మి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

దేవరకద్ర: దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి.. అన్నివిధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పరికరాల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారు సమాజంలో అందరితో కలిసి ఉండే విధంగా అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఇతర ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి దివ్యాంగుడి వివరాలను సేకరించి, అవసరమైన పరికరాలు అందించే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓ సీత్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫారూఖ్, రాజశేఖర్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

సకలజనుల సమ్మె కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న చంద్రానాయక్

స్టేషన్ మహబూబ్‌నగర్: స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని టీఎన్జీఓఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, సెంట్రల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిలుగౌడ్, చంద్రకాంత్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పారిశ్రామిక వాడలో బుధవారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో నమోదైన కేసులను ఎత్తివేస్తామని గత ప్రభుత్వం చెప్పి మాట తప్పిందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అంతకుముందు వినియోగదారుల హక్కుల ఫోరం అధ్యక్షుడు ఆడమ్స్ చట్టాలు, హక్కులను వివరించారు. సమావేశంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు, జీబీ పాల్, నారాయణ, ఉమేష్ కుమార్, లలితమ్మ, భీమమ్మ, నాగాంజనేయులు, బుచ్చన్న, నస్కంటి నాగభూషణం తదితరులు ఉన్నారు.

'వినాయకనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని ఎదిరకు వెళ్లే దారిలో బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వినాయకనగర్‌లో ఎన్నో సమస్యలు నెలకొన్నాయని కాలనీ సంక్షేమ సంఘం కొత్త గౌరవాధ్యక్షుడు అనంతరెడ్డి, అధ్యక్షుడు జి.టి.నరేందర్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. బుధవారం కాలనీలోని పార్కు వద్ద సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందించాలన్నారు. అన్ని విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య కూడళ్లలో హైమాస్ట్ లైట్లు బిగించాలన్నారు. పార్కు స్థలాలను మున్సిపల్ అధికారులు పరిరక్షించాలని కోరారు. ముఖ్యంగా వీధికుక్కల బెడద నివారించాలని, సీసీరోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి త్వరలోనే మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్‌తోపాటు కౌన్సిలర్‌ను కలిసి వినతిపత్రం అందజేయాలని తీర్మానించారు. అలాగే చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయొద్దని, స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. కాగా, అంతకుముందు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీరితో పాటు కోశాధికారిగా శ్రీనివాస్ ఆర్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్.వెంకటేష్, ఉపాధ్యక్షులుగా యాదయ్య, డా.నరేష్‌చంద్ర, మహిపాల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శులుగా టి.అంజిత్, ఎ.రమణ, ఆడిటర్‌గా జగదీష్ ఎన్నికయ్యారు.



వినాయకనగర్ సంక్షేమ సంఘం కార్యవర్గం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

దేవరకద్ర రూరల్: ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ బలరాం అన్నారు. బుధవారం మండలంలోని చౌదరపల్లి గేట్ కాకతీయ మోడల్ ప్రైవేటు స్కూల్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్ష విధానాన్ని పరిశీలించారు. డీసీఈబీ నుంచి వచ్చిన ప్రశ్నపత్రాలను మాత్రమే ఉపయోగించాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు చౌదర్‌పల్లి పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పేదలకు అండగా సర్కార్

గండీడ్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెన్నచేడ్‌లో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యం ఇతరత్రా కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ బోయిని గోపాల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చెన్నయ్య, మాజీ ఎంపీటీసీ ఆశన్న, పులేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణనాయక్, శరణప్ప, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత అవసరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని డెంటల్ డాక్టర్ వైష్ణవి సూచించారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో బుధవారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి పైగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది జ్యోతి, నందన్‌రెడ్డి, పావని, షాకీర్ పాల్గొన్నారు.

అయోడిన్ లోపాన్ని నివారిద్దాం

జడ్చర్ల టౌన్/మిడ్జిల్: అయోడిన్ లోపంతో ఏర్పడే రుగ్మతలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జడ్చర్ల మండలం పోలేపల్లి, కొండేడ్ గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్ట్ టెస్టింగ్ కిట్లు ఉపయోగించి, ఉప్పు వాడే విధానాన్ని వివరించారు. అయోడిన్ లోపంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.అఖిలేష్, ఏఎన్ఎంలు మాలతి, ప్రమీల పాల్గొన్నారు.

● మిడ్జిల్ ఆరోగ్య ఉప కేంద్రంలో మండల వైద్యాధికారి శివకాంత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉప్పు వాడకం గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, సిబ్బంది జంగయ్య, దేవయ్య, గీత, నర్మద పాల్గొన్నారు.

పచ్చ జొన్నలకు భలే డిమాండ్

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం అమ్మకానికి వచ్చిన పచ్చ జొన్నలను కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు. వానాకాలంలో సాగుచేసిన పచ్చ జొన్నల దిగుబడులు రావడంతో రైతులు మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చారు. అయితే టెండర్లు మధ్యాహ్నం 2 గంటలకు ఉండటంతో వ్యాపారులు అంతకు ముందే ధరలు నిర్ణయించి పచ్చజొన్నలను కొనుగోలు చేశారు. నాణ్యతగా ఉన్న జొన్నలకు క్వింటాల్ రూ. 8వేల ధర నిర్ణయించారు. రెండో రకానికి రూ. 7 వేల వరకు ధర లభించింది. చాలా మంది వినియోగ దారులు పచ్చ జొన్నలను కొనడానికి పోటీ పడ్డారు. 50 కేజీల బస్తాను గరిష్ఠంగా రూ. 4వేలు, కనిష్ఠంగా రూ. 3,500 ధరలకు అమ్మకాలు సాగించారు.



రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: రైతులు, ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండలం పర్దీపూర్‌లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులను మభ్యపెడుతూ అన్యాయం చేస్తోందన్నారు. వానాకాలం పంటకు రైతుభరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడితే పోలీసు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఉద్యమ పార్టీకి కేసులు కొత్తేమీ కాదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని.. అండగా ఉంటామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము, మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, వేణుగోపాల్, వట్టెం రాములు ఉన్నారు.

అప్పంపల్లి రోడ్డుకు మరమ్మతు

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి రోడ్డు మరమ్మతు పనులకు బుధవారం గ్రామస్తులు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే ఉద్దాల ఉత్సవం అప్పంపల్లి గ్రామం మీదుగా కొనసాగుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశంతో రోడ్డు మరమ్మతు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహులు, సుదర్శన్, శాంతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఎల్.రఘురెడ్డి, పి.రాఘవరెడ్డి, నాగిరెడ్డి, కుర్వ శ్రీను, అంజన్న, రాజారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

మిడ్జిల్: మండలంలోని చౌటకుంటతండా నుంచి తుల్జానాయక్ తండా వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బీటీరోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని.. విషయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు శ్రీనునాయక్, రమేష్, ఘాన్సీరాం, సీతారాం, మహేష్, జగన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



అప్పంపల్లిలో రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

సత్యేశ్వర సేవ ఆశ్రమంలో మరో మైలురాయి

మానసిక స్థితి నుంచి కోలుకుని కుటుంబ సభ్యుల చెంతకు చేరిన మహిళ



కుటుంబ సభ్యుల చెంతకు చేరిన హైమావతి

జడ్చర్ల టౌన్: మహాలక్ష్మి సేవాట్రస్టు ఆధ్వర్యంలో బాదేపల్లి పట్టణంలో కొనసాగుతున్న సత్యేశ్వర ఆశ్రమం మరో మైలురాయికి చేరుకుంది. ఆశ్రమంలో ఆశ్రయం కల్పించిన ఓ మహిళ కోలుకుని బుధవారం స్థానిక సీఐ ఆదిరెడ్డి సమక్షంలో కుటుంబ సభ్యుల చెంతకు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. ఆరు నెలల క్రితం బాలానగర్‌లో 44వ నంబరు జాతీయ రహదారిపై మతిస్థిమితం కోల్పోయి యువతి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు.. సత్యేశ్వర ఆశ్రమ నిర్వాహకులకు సమాచారం అందించారు. నిర్వాహకులు ఆ మహిళను ఆశ్రమానికి తీసుకువచ్చి, సపర్యాలు చేశారు. ఆశ్రమంలో అందించిన చికిత్స, యోగా, ధ్యానంతో సదరు మహిళ మతిస్థిమితం నుంచి కోలుకుంది. తన పేరు హైమావతి అని.. షాద్‌నగర్‌కు చెందిన కుటుంబ సభ్యుల వివరాలను తెలియజేసింది. దీంతో స్థానిక సీఐ ఆదిరెడ్డి ద్వారా బుధవారం కుటుంబ సభ్యులను పిలిపించారు. అనంతరం షాద్‌నగర్‌లోని తల్లి సరస్వతి చెంతకు హైమావతిని చేర్చారు. సత్యేశ్వర ఆశ్రమం ద్వారా ఇప్పటి వరకు 110 మందిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చినట్లు ట్రస్టు నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, రామకృష్ణ తెలిపారు. మతిస్థిమితం కోల్పోయి తల్లి నుంచి దూరమైన హైమావతి బ్యూటీషియన్ కోర్సు చేసి, కొన్నాళ్లపాటు పార్లర్‌లో పనిచేసింది. వివాహం అనంతరం పిచ్చిచేష్టలు చేస్తుండటంతో భర్త రెండేళ్ల క్రితం అర్ధరాత్రి ఆటోలో తీసుకువచ్చి తల్లి వద్ద వదిలేసి వెళ్లినట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల కోసం చలో కలెక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రైవేటు కళాశాలలను బంద్ చేసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, లక్ష్మణ్, మధు, రాజేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థినులకు అభినందన



అడ్డాకుల: మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు కళ, అంజలి ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థినులను హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి, పీడీ సుగుణ, నేతాజీ యువజన సంఘం సభ్యులు ముక్తార్, ఆరిఫ్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్ఎం పేర్కొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఇటీవల గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్న సామాజిక వేత్త, పంచాయతీరాజ్ ఉద్యోగి సయ్యద్ మాసుమ్ మోహియొద్దీన్‌ను బుధవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి తన చాంబర్‌లో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు శ్రీహరి, అశోక్, సయీద్, సీనియర్ అసిస్టెంట్లు రవి, శ్రీనివాస్, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ బెన్సన్, టీపీ రంగనాథం, సూపరింటెండెంట్ పి.మాధవ్, సీనియర్ అసిస్టెంట్ ఇమ్రానాబేగం, రఘురాంగౌడ్ సత్కరించారు.

జీహెచ్‌ఎంలపై సస్పెన్షన్ తగదు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో 11 మంది జీహెచ్‌ఎంలపై అధికారులు విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని పీఆర్టీయూ టీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఆయన స్పందిస్తూ.. వాస్తవాలను తెలుసుకొని సస్పెన్షన్ అంశాన్ని పరిశీలిస్తామని, వారి ఇబ్బందులను ఆర్జేడీ కార్యాలయంలో తెలియజేయాలని సూచించినట్లు తెలిపారు. హర్షవర్ధన్‌రెడ్డి, ఉమాకర్‌రెడ్డి, యుగంధర్, భూపతిసింగ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్డీఓ తనిఖీ

మిడ్జిల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మహబూబ్‌నగర్ ఆర్డీఓ నవీన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఇటీవల ఓపెన్ ప్లాట్లను వ్యవసాయ భూమిగా మార్పి చేసిన రిజిస్ట్రేషన్‌పై ఆరా తీశారు. ఆర్డీఓ వెంట డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ ఉన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

అడ్డాకుల: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు సూదిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం నందిపేట ఊరచెరువులో బుధవారం చేపపిల్లలను వదిలారు. ఎన్ఎస్‌యూఐ గ్రామ అధ్యక్షుడు కుర్వ శ్రీకాంత్, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి ఘన నివాళి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బుధవారం పలు సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు వెంకటేశ్వర్లు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు శివన్న, బాలచందర్, గోపాల్, రామలింగం, జక్క గోపాల్, జంగన్న, గుండ మనోహర్, ఆంజనేయులు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

మిడ్జిల్: మండలంలోని మసిగుండ్లపల్లి, రాణిపేట గ్రామాల్లో బుధవారం పేకాట స్థావరాలపై మహబూబ్‌నగర్ సీసీఎస్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట రాయుళ్ల నుంచి 14 బైక్‌లతో పాటు రూ.9,070 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్కడి నుంచి పేకాట రాయుళ్లు పరారయ్యారని.. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.